క్లుప్తంగా

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యనందించాలి

శాయంపేట : ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్యనందించాలని బహుజన స్టూడెంట్స్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద సురేశ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండే జర్నలిస్టుల సమస్యలు, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారి పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్యనందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మడికొండ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ

దామెర : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు అందుకున్న అధికారులకు శనివారం అభినందనలు వెల్లువెత్తాయి. ప్రశంస పత్రం అందుకున్న ఎస్సై కొంక అశోక్‌ను, ఏపీఓ శారదను పలువురు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం తెలంగాణ ఉద్యమ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మంద వీరస్వామి, సోనబోయిన రాజు, ఆలేటి సునీల్ కుమార్, గుండె రమేశ్, లంక రవీందర్ సన్మానించిన వారిలో ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



ఎల్కతుర్తి : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని పీహెచ్‌సీ డాక్టర్ ముత్తేర్ రహమాన్, డాక్టర్ రుబీనా అన్నారు. భీమదేవరపల్లి మండలం వంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం రంగయ్యపల్లి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. పెద్దమ్మగడ్డ, ప్రభుత్వ ఐటీఐ, ఇండస్ట్రీయల్ ఏరియా, వరంగల్ సిటీ సెంటర్, కియా షోరూం, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే 'చల్లా'

ఖిలా వరంగల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో శనివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు కార్పొరేటర్లు మనోహర్, సుంకరి మనీషా, గద్దె బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు వారు పుష్పగుచ్ఛం అందజేశారు. యువతకు అవకాశం ఇచ్చిన ధర్మారెడ్డిని కేటీఆర్ అభినందిస్తూ, కష్టకాలంలో పార్టీకి వెన్నంటూ ఉన్న మీలాంటి వారిని ముమ్ముందు పార్టీలో మరింత ప్రాధాన్యత కల్పిస్తామన్నారు.

శాశ్వత భవనం నిర్మించాలి

కాజీపేట : పట్టణంలో అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించాలని కోరుతూ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రియాజ్‌కు సామాజిక కార్యకర్త కె.ప్రకాశ్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రియాజ్ స్పందించి భవనానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కు రిజర్వేషన్ కల్పించాలి

ఎంజీఎం : రాష్ట్రంలోని మెడిసిన్ అడ్మిషన్ ప్రక్రియలో ఎన్‌సీసీ కేడెట్స్‌కు రిజర్వేషన్ కల్పించాలని జాతీయ యువజన పురస్కార గ్రహీత, సామాజిక కార్యకర్త మండల పరశురాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన వినతిపత్రాన్ని కాళోజీ నారాయణ హెల్త్ యూనివర్సిటీ వీసీకి అందజేశారు. ఇతర రాష్ట్రాలు ఇప్పటికే ఎన్‌సీసీ కేడెట్స్ కోసం మెడికల్ అడ్మిషన్స్‌లో రిజర్వేషన్ పాలసీ అమలు చేస్తున్నాయని, అదే విధంగా రాష్ట్రంలో కూడా అ విధమైన పాలసీని అమలు చేయాలని కోరుతున్నట్లు వివరించారు.

అభివృద్ధి చేసుకుందాం..

హన్మకొండ: కాలనీని సంఘటితంగా అభివృద్ధి చేసుకుందామని టీవీ టవర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పల్లెపాటి సమ్మిరెడ్డి అన్నారు. శనివారం హనుమకండలోని టీవీ టవర్ కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. రాబోయే కృష్ణాష్టమి, గణపతి నవరాత్రి ఉత్సవాలు, దేవీ నవరాత్రి ఉత్సవాలను కాలనీ అభివృద్ధి కమిటీ, ఓం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీవాసులంతా ఒకటిగా ఉండి అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

కీచకులను కఠినంగా శిక్షించాలి

- కోల్‌కతా ఘటనపై వైద్యుల ఆగ్రహం
- నినాదాలతో దద్దరిల్లిన ఆస్పత్రి పరిసరాలు
- జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- నిందితులను ఉరి తీయాలని డిమాండ్

పశ్చిమ బెంగాళ్ రాష్ట్రంలోని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై దుండగులు అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐఎంఓ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, సిబ్బంది రోడ్డెక్కి నిరసనకు దిగారు. లేడీ డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిందితులకు ఉరి శిక్ష విధించాలి కోరారు. వైద్యులు చేసిన 'వీ వాంట్ జస్టీస్' నినాదాలతో ప్రధాన కూడళ్లు, ఆస్పత్రి పరిసరాలు దద్దరిల్లాయి.



కమలాపూర్ : నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్యసిబ్బంది

కమలాపూర్ : పశ్చిమ బెంగాళ్ రాష్ట్రంలోని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని వైద్యులు, వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు ప్రియాంక, విజిత మాట్లాడుతూ.. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడి హత్య చేయడం అమానుషమన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్ల ప్రాణాలు తీయడం సభ్య సమాజం తలదించుకునే చర్య అన్నారు. డ్రగ్స్ తీసుకున్న వారికి తాము ఏం చేస్తున్నామనే స్పృహ ఉండదని, ఆ మత్తులో ఎన్నో దారుణాలకు ఒడిగడుతున్నారని అన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను సమూలంగా అరికట్టాలన్నారు. జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను వెంటనే ఉరి తీయాలని కోరారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేశ్, పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు, డాక్టర్ వరుణ్, హెడ్ నర్సింగ్ ఆఫీసర్ జ్యోతి, రేడియోగ్రాఫర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ అమృత, ఫార్మసిస్ట్ సుశ్రిత, నర్సింగ్ ఆఫీసర్లు శాంత, ప్రమీల, సరిత, సునీత, అనిత, సుమీర తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో..

హన్మకొండ (పరకాల) : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ అత్యాచారం ఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు పరకాల సివిల్ ఆసుపత్రి వైద్యులు శనివారం అత్యవసర వైద్యసేవలు మినహా అన్ని రకాల సేవలను నిలిపివేసి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్ మాట్లాడుతూ.. జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను గుర్తించి వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు.

శాయంపేటలో..

శాయంపేట : విధి నిర్వాహణలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన దుండగులను ఉరి తీయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఐఎంఏ పిలుపు మేరకు శనివారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు. దుండగులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా కోరారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన దుండగులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని భీమదేవరపల్లి మండలం వంగర పీహెచ్‌సీ వైద్యులు శనివారం నిరసన తెలిపారు. పీహెచ్‌సీ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ప్లాకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ముత్తేర్ రహమాన్, డాక్టర్ రుబీనా, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : కోల్‌కతాలో మెడికోపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన కీచకులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యులు, వైద్యసిబ్బంది నిరసనకు దిగారు. ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు వైద్యసేవలు నిలిపివేసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన దుండగులను పట్టుకుని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. మహిళా డాక్టర్లు, సిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టాలను రూపొందించాల్సిన అవసరం అందున్నారు. హత్య కేసును సీబీఐ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఎంతటి వారినైనా చట్టం ముందు నిలబెట్టాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ స్పందన, చైతన్య, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మితో పాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఆత్మకూరు : స్థానిక పీహెచ్‌సీ ఎదుట వైద్యుల నిరసన



ఎల్కతుర్తి : వంగర పీహెచ్‌సీ వైద్యుల నిరసన..



శాయంపేట : స్థానిక పీహెచ్‌సీ ఎదుట..



పరకాల : సివిల్‌ఆసుపత్రి ఎదుట..

చదువులో పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



శాయంపేట : విద్యార్థులు చదువులో పోటీ తత్వాన్ని అవర్చుకుంటేనే మంచి ర్యాంకులు సాధించవచ్చని మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఎంజేపీలో చదువుతున్న ప్రతీ విద్యార్థి ఆణిముత్యంలా తయారు కావాలని ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ఎస్‌వీకేకే ఫంక్షన్ హాల్‌లో శనివారం మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను కమిటీ కో ఆర్డినేటర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఓంబ్రహ్మం అధ్యక్షతన జరిగింది. ఈ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాయంపేట ఎంజేపీ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న ప్రతీ విద్యార్థి ప్రతిభావంతుడు కావాలని అన్నారు. గురుకులంలో చదివి వివిధ రంగాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు అప్పుడప్పుడు పాఠశాలను సందర్శించాలని కోరారు. గురుకులంలో పాఠాలు బోధిస్తున్న గురువులు 24 గంటలు కష్టపడుతున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. చెడు స్నేహానికి, వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. చదువుపై ఏకాగ్రత వహిస్తే విజయం సొంతమవుతుందని అన్నారు. గురుకులాలను అభివృద్ధి చేసి మరింత నాణ్యమైన విద్యను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుకులాల సెక్రటరీ సైదులు, ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ సుభాషిణి, పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఐనవోలు : విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా విద్యార్థుల నడవడికపై దృష్టి సారించాలని ఐనవోలు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువులో పురోగతి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. అందకు విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు ఒకే నిర్ణయం తీసుకుని పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్ రావు

ఆగిన గుండెలు..


- ఒకే మండలంలో ఇద్దరి మృతి



సునీల్‌కుమార్ (ఫైల్)

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన కనుకుంట్ల సునీల్‌కుమార్ (43) అనే ప్రభుత్వ ఉద్యోగి గుండెపోటుతో శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సునీల్‌కుమార్ ఖమ్మంలో నీటి పారుదల శాఖలో పే అండ్ అకౌంట్స్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ హనుమకొండలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం ఛాతీలో నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన.. అదేరోజు రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి తల్లి, భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉండే సునీల్ అకాల మరణంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా స్వగ్రామమైన కమలాపూర్‌లో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఉప్పల్‌లో రిటైర్డ్ ఎంఈఓ..



పోతిరెడ్డి మోహన్ (ఫైల్)

మండలంలోని ఉప్పల్‌కు చెందిన రిటైర్డ్ ఎంఈఓ పోతిరెడ్డి మోహన్ (80) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మోహన్‌కు మూడు రోజుల క్రితం గుండె నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం హనుమకొండకు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆయన.. పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచనట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా పోతిరెడ్డి మోహన్ గతంలో వివిధ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడిగా, రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ సంఘం నేతగా, కమలాపూర్ మండల విద్యాధికారిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సంతాపం తెలిపారు.

మత్తుకు బానిసైతే జీవితం నాశనం

- ఎస్సై సురేశ్



మాట్లాడుతున్న ఎస్సై సురేశ్

వేలేరు : జల్సాల కోసం మత్తుకు బానిసైతే జీవితం నాశనం అవుతుందని ఎస్సై సురేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సేయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో ఫాదర్ కిరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు, గుట్కా, పొగాకు పదార్థాలు, ఇతర మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు చాక్లెట్స్, ఇతర తినుబండారాలు ఇస్తే తీసుకోవద్దని అన్నారు. చదువుకునే వయస్సులో కష్టపడితే మిగతా జీవితం అంతా పూలపాన్పు అవుతుందని అన్నారు. ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ సరాఫరా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

19 నుంచి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

దామెర : మండల కేంద్రంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు పోచమ్మ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పునర్నిమాన కమిటీ చైర్మన్ తాటికొండ రాజేందర్ స్పష్టం చేశారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఆయన విలేకరులకు ఉత్సవాల వివరాలు వెల్లడించారు. 19న ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచన, కంకణధారణ, అకండ ప్రజ్వలన, అగ్నిప్రతిష్ఠ, గణపతి హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న ఉదయం పునఃపూజలు, సమస్తదేవతా ఆరాధన కార్యక్రమాలు, సాయంత్రం విగ్రహాలతో శోభాయాత్ర, అంగవైకల్య హోమం, ఉపమండప ఆవాహన హోమం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, ఫలాధివాసం తదితర పూజలు ఉంటాయని పేర్కొన్నారు. 21 ఉదయం పునఃపూజలు, వాస్తుపూజ, హోమం అనంతరం మహాయంత్ర ప్రతిష్ఠాపన, పోచమ్మతల్లి దేవత యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ దైవ బలం, యంత్ర బలం, మంత్ర బలంచే నిర్వహించనున్నట్లు తెలిపారు. శాంతి మంత్ర పఠన, (గుమ్మడికాయ) కూష్మాండ పూజలు నిర్వహిస్తామని తెలిపారు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఈ సందర్భంగా ఆయన ప్రకటనలో పిలుపునిచ్చారు.

సంక్షిప్తంగా

రామయ్య సన్నిధిలో పరకాల ఎమ్మెల్యే రేవూరి..



భద్రాచలం : భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామిని హనుమకొండ జిల్లా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు పూజలు చేసి ఉపాలయాలను దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలు, జ్ఞాపిక అందచేశారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తా



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లలో గల కోళ్లఫారం నుంచి దుర్గంధం వెదజల్లుతోందని, చర్యలు తీసుకోవాలని స్థానికులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటనారాయణ శనివారం విచారణ చేపట్టారు. స్థానిక ప్రజలతో మాట్లాడి కోళ్లఫారం వద్ద పరిస్థితిని పరిశీలించారు. పూర్తి వివరాలతో నివేదికను తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక



ఐనవోలు : ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంద రమేశ్, జిల్లా ప్రధానకార్యదర్శి బాబు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మండల అధ్యక్షుడిగా కొత్తూరు ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా ఐలపాక నాగరాజు, కొత్తూరి కుమార్, ప్రధానకార్యదర్శిగా పసునూరి రాజేందర్, కోశాధికారిగా బరిగల విష్ణు, కార్యదర్శులుగా యాకర అజయ్, కట్కూరి కార్తీక్, కమిటీ సభ్యులుగా జైపాల్, వంశీ, హరినాథ్, కుమారస్వామిని ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన సాల్లేటి రవికి చెందిన కాడెద్దు విద్యుదాఘాతంతో శనివారం మృతిచెందింది. రవి తన చేనులో పనులు ముగించుకుని ఎద్దును మేత కోసం వదిలిపెట్టాడు. పచ్చిక మోస్తూ వెళ్లి ఎస్ఎస్ 18/25కేవీ డీటీఆర్ వద్ద ఎర్త్ వైర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురైన కాడెద్దు.. అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.80 వేల విలువ ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

అటెన్షన్ ప్లీజ్

పిచ్చిమొక్కలు తొలగించరూ..



ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని ప్రధాన రహదారులకిరువైపుల పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరుగడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది అనారోగ్య బారినపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 9491324175

అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



పరకాల : రాఖీలు కడుతున్న విద్యార్థినులు



శాయంపేట : ప్రిన్సిపాల్‌కు రాఖీ కడుతున్న విద్యార్థిని



హన్మకొండ (పరకాల) : అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగని శారదా విద్యాలయం ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. పాఠశాలలో శనివారం ముందస్తు రాఖీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టి సోదర సౌభ్రాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు తోటి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు నర్సింహస్వామి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తోటి విద్యార్థులకు, అధ్యాపకులకు రాఖీలు కట్టారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి.

ఆత్మకూరులో..

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పాఠశాల హెచ్‌ఎం ప్రతాప రత్నకుమార్ రక్షాబంధన్ ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం బాలికలతో బాలురందరికీ రాఖీలు కట్టించారు. ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ బాలాజీనగర్ సెకండ్ డాక్టర్స్ కాలనీ, బృందావన కాలనీకి చెందిన తుమ్మనపల్లి గణేశ్ శుక్రవారం నుంచి కనిపించడం లేదని తండ్రి వీరాచారి శనివారం మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లయ్య తెలిపారు.